క్లుప్తంగా

జెడ్సీకి వినతుల వెల్లువ



కార్యక్రమంలో పాల్గొన్న జోనల్ అధికారులు

గాజువాక : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్‌కు ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తాయి. వివిధ సమస్యలపై మొత్తం 22 వినతులు అందినట్టు జెడ్సీ సన్యాసిరావు తెలిపారు. నీటి సరఫరాలో సమస్యల పరిష్కారం, ఆక్రమణల తొలగింపు, ఆస్తి పన్నుల మదింపు, విధింపు, రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, మరమ్మతులు, ప్రభుత్వ పథకాల అమలు, పార్కుల అభివృద్ధి తదితర అంశాలపై వినతులు అందినట్టు జెడ్సీ తెలిపారు. వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాల్సిందిగా ఆయన సంబంధిత విభాగాధిపతులకు ఆదేశించారు.

గెడ్డల్లో పూడిక తొలగించాలి



జెడ్సీకి వినతిపత్రం అందజేస్తున్న అప్పారావు

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు మదీనాబాగ్‌-బచ్చియ్యపేట ప్రాంతంలోని జేఎస్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ సమీపంలోని పెద్ద గెడ్డలో పూడిక తొలగించాలని ఆ ప్రాంత ప్రజలు జెడ్సీని కోరారు. ఈ మేరకు జీవీఎంసీ జోన్‌-6 జోనల్ కమిషనర్ సన్యాసినాయుడుకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ జేఎస్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో ఉన్న సీవేజ్ ట్రీట్‌మెంట్ వేస్ట్ వాటర్ ప్లాంట్ నుంచి వచ్చే మురుగునీరు మదీనాబాగ్‌-బచ్చియ్యపేటలో గల గెడ్డ నుంచి ప్రవహిస్తోందని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెత్తాచెదారంతో ఆ గెడ్డ పూడుకుపోయిందని, దీనివల్ల దోమలతో ఇబ్బంది పడుతున్నామన్నారు. తద్వారా విష జ్వరాలతో అల్లాడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి గెడ్డలో పూడిక తీయించాలని కోరారు.

సత్యసాయి సేవాసంస్థల వితరణ



బెంచీలు, పుస్తకాలు అందజేస్తున్న సత్యసాయి సంస్థల ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ప్రతినిధులు తుంగ్లాం ప్రాథమిక పాఠశాలకు బెంచీలు, విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీ కిట్స్ అందజేశారు. 69వ వార్డు తుంగ్లాంలోని శ్రీ సత్యసాయి మందిరంలో సేవా సంస్థల ప్రతినిధులు నగేష్, భారతిల ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి చేతుల మీదుగా వీటిని అందజేశారు.

మానసిక దివ్యాంగురాలికి వైద్యసేవలు



దివ్యాంగురాలిని ఆస్పత్రికి తీసుకెళ్తున్న మమత

విశాఖ విద్య: ఫుట్‌పాత్‌పై జీవనం సాగిస్తున్న మానసిక దివ్యాంగురాలికి బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత వైద్య సేవలు అందించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. కరాస ప్రాంతంలో ఫుట్‌పాత్‌పై కొన్ని రోజులుగా ఓ మహిళ ఉంటుందని సమాచారం తెలుసుకున్న మమత ఎయిర్‌పోర్టు పోలీసుల సహకారంతో అక్కడికి వెళ్లి ఆమె వివరాలు తెలుసుకున్నారు. కానిస్టేబుల్ రామలక్ష్మి సాయంతో ఆస్పత్రిలో చేర్పించి ఆమెకు వైద్యం చేయించారు. కోలుకున్న తర్వాత ఆమెను కుటుంబీకులకు అప్పగిస్తామని మమత తెలిపారు.

యారాడ తీరం.. ఆహ్లాదకరం



యారాడ తీరం

ప్రకృతి రమణీయతకు నెలవుగా అలరారుతోంది యారాడ తీరం. చుట్టూ హరిత శోభితమైన గిరులు .. కనువిందు చేసే కొబ్బరిచెట్లతో పర్యాటకులను ఆకర్షిస్తోంది. విశాలమైన బీచ్, గంగవరం ఘాట్ రోడ్డు ఒంపుల్లో ప్రయాణం సందర్శకులకు మధురానుభూతిని పంచుతోంది. ఇక్కడి సహజ సౌందర్యానికి ఫిదా అయిన పర్యాటకులతో పాటు గాజువాక పారిశ్రామిక ప్రాంతానికి చెందిన యువకులు మిత్రులతో తరచూ వచ్చి ఆనందంగా గడుపుతుంటారు. సముద్రంలో, తీరంలోని ఇసుక తిన్నెల్లో ఆటలాడుతూ మరపురాని జ్ఞాపకాలను సొంతం చేసుకుంటారు. అయితే, తీరంలో పిల్లలు ఆడుకునేందుకు వీలుగా పార్కులను అభివృద్ధి చేసినా, ఆట పరికరాలు మూలకు చేరడంతో చిన్నారులు నిరాశ చెందుతున్నారు. అధికారులు స్పందించి పరికరాలను అందుబాటులోకి తీసుకు రావాలని కోరుతున్నారు. – పెదగంట్యాడ



తీరంలో కనువిందు చేస్తున్న కొబ్బరి చెట్లు



కొండల నడుమ ఆకర్షిస్తున్న సాగర తీరం



యారాడ తీరంలో పర్యాటకుల సందడి

రహదారి నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



మాట్లాడుతున్న స్టీల్‌ప్లాంట్ సీఐ శ్రీనివాసరావు

ఉక్కునగరం: రహదారి నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు తెలిపారు. రహదారి నిబంధనలపై ఆటో డ్రైవర్లు, బస్సు డ్రైవర్లు, హెల్పర్లకు స్థానిక డీపాల్ పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆటో నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓవర్ లోడింగ్ లేకుండా పరిమితంగా ప్రయాణికులను ఎక్కించుకోవాలన్నారు. విద్యార్థులతో ప్రయాణం చేసేటప్పుడు అతి వేగం పనికి రాదన్నారు. ఇంటి నుంచి పాఠశాలకు తీసుకువచ్చి తిరిగి తల్లిదండ్రులకు అప్పగించేలా బాధ్యత తీసుకోవాలన్నారు. ఉక్కునగరంలో గతంలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ జి.ఎస్.వి.మహాలక్ష్మి, పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఫాదర్ అనీష్, వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ షాజీ తదితరులు పాల్గొన్నారు.

క్లాప్ లోడర్ల ఆందోళన



ఆందోళన చేస్తున్న కార్మికులు

గాజువాక : జీవీఎంసీ గాజువాక జోన్‌లో క్లాప్ వాహనాల లోడర్లు సోమవారం ఆందోళనకు దిగారు. తమకు ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉండిపోయిన వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ జోనల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. క్లాప్ వాహనాలను పార్కింగ్ యార్డు నుంచి కదలనివ్వకుండా అడ్డుకున్నారు. వారికి జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు మద్దతు ప్రకటించారు. క్లాప్ లోడర్లకు జీతాలు సకాలంలో చెల్లించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని యూనియన్ కార్యదర్శి గొలగాని అప్పారావు పేర్కొన్నారు.

స్టీల్‌ప్లాంట్ జీఎం సంజీవరావుకు అభినందనలు



సంజీవరావును సత్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ (ఐఆర్) జనరల్ మేనేజర్ కంచర్ల సంజీవరావును స్టీల్‌ప్లాంట్ ఏఐటీయూసీ, స్టీల్‌ప్లాంట్ డీవీఆర్ ట్రేడ్ యూనియన్ నాయకులు ఘనంగా సత్కరించారు. సంజీవరావు ఈ నెలాఖరున పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా సోమవారం వైఎస్సార్‌టీయూసీ నాయకులు సంజీవరావును శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు మాట్లాడుతూ కార్మిక పక్షపాతిగా సంజీవరావు అనేక ఒప్పందాల్లో కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ జీఎం ఎస్.భాను, జి.బోసుబాబు, మసేనురావు, కె.రాజబాబు, జి.జయ, డి.దేముడు, రాజేష్, పట్నాయక్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

- డీవీఆర్ ట్రేడ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.వి.రమణారెడ్డి నేతృత్వంలో నాయకులు జీఎం సంజీవరావును సత్కరించారు. నాయకులు మాట్లాడుతూ కార్మిక శ్రేయస్సు కోసం అనేక ఒప్పందాల్లో సంజీవరావు కీలకంగా వ్యవహరించారన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పలువురు పాల్గొన్నారు.

'శిష్ట కరణాలను ఓబీసీ జాబితాలో చేర్చాలి'



మాట్లాడుతున్న శిష్టకరణాల అధ్యక్షుడు గోపీ

అగనంపూడి: కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం శిష్ట కరణాలను ఓబీసీ జాబితాలో చేర్చేందుకు సహకారం అందించాలని శిష్ట కరణం అసోసియేషన్ కూర్మన్నపాలెం కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ఎస్‌వి గోపాల్, డి.సత్యారావు కోరారు. వడ్లపూడి కాలనీలో సోమవారం నిర్వహించిన కూర్మన్నపాలెం కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కలగజేసుకుని ఓబీసీ జాబితాలో చేర్చేందుకు సిఫార్సు చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు డి.గురునాథరావు, శేఖరమంత్రి శ్రీనివాసరావు, కె.రవినాథ్, ఎస్.నాగభూషణం, రాము, కిషోర్ కుమార్, గంగవరం గోపీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

అగనంపూడి: ఇంటర్ విద్యార్థులకు ఈ ఏడాది నుంచి పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందిస్తున్నామని గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదివి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ సందర్భంగా ఆశారాజ్ షైనింగ్ సొసైటీ కార్యదర్శి పులగాపురి ఆశాలత రూ.5వేల నగదును కళాశాల కుర్చీల కోసం అందించారు. కార్యక్రమంలో 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాల్ జి.సుధాకర్‌బాబు, నాయకులు గొల్లవిల్లి కనక భవానీ, బి.సత్యనారాయణ, కె.తాతారావు, ఎస్.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షా సప్తాహ్



లంకెలపాలెం హైస్కూల్లో భోజనం చేస్తున్న విద్యార్థులు



అక్కిరెడ్డిపాలెం హైస్కూల్లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులకు శుభ తిథి భోజనం

అగనంపూడి: శిక్షా సప్తాహ్ కార్యక్రమం ముగింపు సందర్భంగా సోమవారం శుభ తిథి భోజన కార్యక్రమాన్ని 79వ వార్డు లంకెలపాలెం హైస్కూల్లో ఘనంగా నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు ఆర్థిక సహకారంతో పిల్లలకు స్వీట్‌ను భోజనంతో అందించారు. 450 మంది బాలలకు స్వీట్ అందించారు. హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- 88వ వార్డు నంగినారపాడు (అజినగిరి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు భోజనంతో పాటు దాతల సహకారంతో అరటిపళ్లు అందించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.
- పెదముషిడివాడ, లేమర్తి హైస్కూల్, పినమడక, అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోనూ విద్యార్థులకు పళ్లు, స్వీట్లు అందించారు.

భాగస్వామ్యంతో సహకారం అందించాలి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం, మింది జిల్లా పరిషత్ హైస్కూళ్లలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ఆఖరి రోజు, సోమవారం సామాజిక భాగస్వామ్య దినోత్సవాన్ని నిర్వహించారు. మధ్యాహ్న భోజనంలో పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులకు అందించే భోజనంలో పండ్లు, పాయసం వంటి ఆహార పదార్థాలను తమ వంతు సాయంగా అందజేశారు. కార్యక్రమంలో అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం కుమార స్వామి, మింది జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం పి.వి.ఎస్.ఎస్.ఎస్.ఆంజనేయ పాల్గొన్నారు.

యోగా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



యోగా పోటీల్లో సత్తాచాటిన తానాం గురుకుల పాఠశాల విద్యార్థులతో హెచ్‌ఎం అప్పలనాయుడు

పరవాడ: యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విశాఖ జిల్లా సీతమ్మధార కృష్ణమందిర్‌లో ఈ నెల 28న జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో తానాం గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు.

- 10–12 సంవత్సరాల విభాగంలో జి.తేజశ్విని వెండిపతకం, తేజశ్రీ కాంస్య పతకాలు సాధించారు.
- 12–14 విభాగంలో డి.హర్షిత బంగారు పతకం, బి.వైష్ణవి వెండి పతకం, ఎస్.కౌశిక కాంస్య పతకాలు, 14–16 విభాగంలో కె.హరిత బంగారు పతకం, కె.భావన వెండి పతకం, కె.వెంకట వైష్ణవి కాంస్య పతకాలు సాధించారు.
- పతకాలు సాధించిన విద్యార్థులు సెప్టెంబరులో జరగనున్న రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారు. ఈ మేరకు ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.అప్పలనాయుడు, యోగా శిక్షకుడు సీహెచ్.ఆంజనేయులు అభినందించారు.

'కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'



ఆటోనగర్‌లోని రైల్వే వ్యాగన్ వర్క్ షాపు వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

అక్కిరెడ్డిపాలెం: రైల్వే వ్యాగన్ వర్క్ షాపు కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ అఖిల భారత రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన నిర్వహించారు. వడ్లపూడి ఆటోనగర్‌లోని రైల్వే వ్యాగన్ వర్క్ షాపు ఎదుట నిర్వహించిన కార్యక్రమంలో రైల్వే కాంట్రాక్ట్ వర్కింగ్ అధ్యక్షుడు రాంబాబు మాట్లాడుతూ వర్క్ షాపులో పనిచేస్తున్న కార్మికులకు జీవో ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. భద్రత అమలు చేయాలని, ప్రతీ నెలా పదో తేదీ లోపు జీతాలు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వి.వి.రాజు, వర్క్ షాపు కార్మికుల అధ్యక్షుడు అవతారం, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, సతీష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఊపిరి తీయొద్దు



దీక్షలో పాల్గొన్న పరిరక్షణ కమిటీ నాయకులు

అగనంపూడి: వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కు ఊపిరి తీయొద్దని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జి.బోసుబాబు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షల్లో 1264వ రోజు, సోమవారం కార్యక్రమంలో వారు మాట్లాడారు. మూడున్నర సంవత్సరాల నుంచి విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఆందోళన చేస్తుంటే రోజురోజుకూ ఉక్కును ఇరకాటంలో పెట్టడం, ఉత్పత్తికి విఘాతం కల్గించడం చేస్తుండడంతో కార్మికులు ఆందోళనలో ఉన్నారన్నారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కును ప్రైవేటీకరించబోమని ప్రకటన చేయాలన్నారు. ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షిస్తామని రాష్ట్రంలో నాయకులు హామీ ఇచ్చారని, ఆ మేరకు ఉక్కు పరిరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస నాయుడు, దొమ్మేటి అప్పారావు, వరసాల శ్రీనివాసరావు, డేవిడ్, డి.శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు.

పెదగంట్యాడ తహసీల్దార్‌గా రామారావు



పెదగంట్యాడ: పెదగంట్యాడ తహసీల్దార్‌గా ఎల్.రామారావు నియమితులయ్యారు. శ్రీకాకుళం రణస్థలం తహసీల్దార్‌గా పని చేస్తున్న ఈయనను ఇక్కడ నియమించారు. ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న భాస్కరరావును విజయనగరం మండలానికి బదిలీ చేశారు.

విశ్వశాంతి యోగా సభ్యులకు బహుమతులు



యోగా పోటీల విజేతలతో యోగా గురువు ఈశ్వరరావు

ఉక్కునగరం: విశ్వశాంతి యోగా సత్సంగం సభ్యులు యోగా పోటీల్లో బహుమతులు గెలుపొందారు. విశాఖ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా నుంచి వందలాది మంది పాల్గొన్నారు. ఈ పోటీల్లో విశ్వశాంతి సత్సంగం శిక్షకులు ఎన్.బాబూరావు, జి.అఖిల రెడ్డి, వై.శ్రీను, జి.లక్ష్మి, బి.శ్యామల ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా విశ్వశాంతి యోగా గురూజి, స్టీల్‌ప్లాంట్ రోల్ షాప్ అండ్ రిపేర్ షాప్ జనరల్ ఫోర్‌మన్ కొల్లి ఈశ్వరరావు మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. పోటీల్లో తమ శిక్షకులకు బహుమతులు రావడం ఆనందదాయకమన్నారు.

డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న విశాఖ కంటి ఆస్పత్రి వైద్యులు

ఉక్కునగరం: స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. విశాఖ కంటి ఆస్పత్రి సహకారంతో సెక్టార్‌–2 లోని సత్యసాయి మందిరంలో స్టీల్‌ప్లాంట్ కారు, టాక్సీ డ్రైవర్ల కోసం ఏర్పాటు చేసిన శిబిరాన్ని స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎం జి.గాంధీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ డ్రైవర్లకు కంటి చూపు ఎంతో ముఖ్యమైనదన్నారు. కళ్ల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ జీఎం లలన్ కుమార్, సత్యసాయి సమితి కన్వీనర్ జి.రామకృష్ణ, జిల్లా సేవా విభాగం సమన్వయకర్త ఆర్.ఎ.నాయుడు, కంటి ఆస్పత్రి కో–ఆర్డినేటర్ ఇ.సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ మంగరాజుకు సత్కారం



డాక్టర్ మంగరాజును సత్కరిస్తున్న గ్రామస్తులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 73వ వార్డు కొత్త కర్ణవానిపాలేనికి చెందిన కులుకూరి మంగరాజును ఆయన స్నేహ బృందం, కర్ణవానిపాలెం గ్రామస్తులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు సోమవారం సత్కరించారు. సామాజిక సేవారంగంలో అపార సేవలందిస్తున్న మంగరాజు కృషిని గుర్తించి కేంబ్రిడ్జి యూనివర్సిటీ (యూఎస్ఏ) ప్రతినిధులు ఇటీవల న్యూఢిల్లీలో డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆయన సేవానిరతికి అందిన పురస్కారానికి హర్షం వ్యక్తం చేస్తూ ఆయన్ను ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బెవర సత్యరారాయణ, జనపరెడ్డి అప్పలరాజు, కర్ణం నానాజీ, కేదారిశెట్టి రాజేష్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు కులుకూరి వెంకటరావు, వాసు, శ్రీను, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీకి కార్యకర్తలే బలం



సుదర్శనంను సత్కరిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: ఐఎన్‌టీయూసీ యూనియన్‌కు కార్యకర్తలే బలమని స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. యూనియన్ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ చుట్టుగుళ్ల సుదర్శనం పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా యూనియన్ పాయింట్ వద్ద సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై, ఆయన్ను సత్కరించారు. యూనియన్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ కొమ్ము ప్రసాద్ మాట్లాడుతూ ఐఎన్‌టీయూసీ అభివృద్ధికి సుదర్శనం ఎనలేని కృషి చేశారన్నారు. పదవీ విరమణ తర్వాత కూడా యూనియన్‌కు సేవలు అందించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కారు రమణ, ప్రభాకరరెడ్డి, పి.వి.రమణమూర్తి, బి.ఎస్.రాజు, ఎస్.ఎ.నాయుడు, రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

హైవేపై ప్రమాదాల నివారణకు వినతి



పోలీసులకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అగనంపూడి: జాతీయ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవించి మృతుల సంఖ్య ఆందోళన కలిగిస్తోందని పల్లా కార్తీక్ ట్రస్ట్ చైర్మన్ కార్తీక్, అగనంపూడి నాయకులు కోరారు. పోలీస్ అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ దువ్వాడ సీఐ ఎర్రం నాయుడుకు వినతిపత్రం అందజేశారు. నెలరోజుల వ్యవధిలో గాజువాక, దువ్వాడ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 15 రోడ్డు ప్రమాదాలు సంభవించి 15 మంది మృత్యువాత పడ్డారన్నారు. వేగనియంత్రణ చర్యలు చేపట్టాలని కోరారు. సీఐని కలిసిన వారిలో టీడీపీ కూటమి నాయకులు సోమశేఖర్, బి.సత్యనారాయణ, జి.అప్పారావు, తిలక్ తదితరులు పాల్గొన్నారు.